❖•❖•❖ 13 ❖•❖•❖

# బుద్ధిపూర్వకముకాని ప్రవచనము

*“అయితే వారిలో కయప అను ఒకడు ఆ సంవత్సరము ప్రధానయాజకుడైయుండి – మీకేమియు తెలియదు. మన జనమంతయు నశింపకుండునట్లు ఒక మనుష్యుడు ప్రజల కొరకు చనిపోవుట మీకు ఉపయుక్తమని మీరు ఆలోచించుకొనరు అని వారితో చెప్పెను”*

*(యోహాను 11:49, 50).*

అన్న చేత ప్రశ్నించబడిన తరువాత, తీర్పులను మరొక స్థాయిలో పరిశీలించనైయుండిన, తాత్కాలిక ప్రధానయాజకుడైన కయప యొద్దకు యేసు తీసుకొనిపోబడెను (యోహాను 18:24). విచారణ కొరకు తీసుకొనిరాబడిన యేసును అన్న మరియు కయప ప్రశ్నించుచుండినప్పుడు, యూదుల మహా సభా సభ్యులు ఒకరొకరు నెమ్మదిగా కూడుకొనుచుండిరి. యూదుల మహా సభ పెందలకడనే సమావేశమగుటకు పిలుపు ఇవ్వబడినదను విషయము వాస్తవము గనుక సభ నిర్వహింపబడుటకు అవసరమైన సభ్యులు అంత త్వరగా కనీస సంఖ్యలోనైనా కూడుకొనుటకు కష్టమైనది. నిస్సందేహముగా, సమయానికి చాలినంతమంది సభ్యులను సమావేశపర్చుటకు వార్తాహరులు సభ్యుల ఇంటింటికి వేగిరముగా పరుగెత్తవలసి వచ్చినది.

యేసు కయప చేత ప్రశ్నించబడుట, తీర్పులలో రెండవ దశను యోహాను పరిచయము చేయుచు, యేసును వినాశము చేయుట గూర్చి వారు వెంటనే చర్య తీసుకొననందుకు అంతకు మునుపు యూదుల మహా సభను గద్దించినవాడు ప్రధాన యాజకుడైన ఈ కయపనే అని చదువరులకు గుర్తుచేయుచున్నాడు (యోహాను 18:14; 11:49, 50 చూడుము). జనమంతయు నశింపకుండునట్లు ఒక మనుష్యుడు ప్రజల కొరకు చనిపోవుట "ఉపయుక్తము" అని ఆయన వారితో చెప్పాడు. రోమా ప్రభుత్వ పరిపాలనలో యుండిన ఇశ్రాయేలీయులు వారి ప్రత్యేకార్హతలను కాపాడుకొనునట్లు యేసు మరణమునకు అప్పగింపబడుట అవసరమని ఆయన నమ్మియుండెను. గనుక "యూదుల పాలక మండలిగా మనము చర్య తీసుకొననట్లయితే నజరేయుడైన ఈ మనుష్యుడు ఉద్యమము మనలను దాని అధీనము చేసుకొనును, అప్పుడు మన దేశము మరియు యూదుల మహా సభగా మన అధికారము మనము కోల్పోవుదుము" అని అర్థమిచ్చుచున్నట్లు మాట్లాడాడు. "మన జనమంతయు నశింపకుండునట్లు, ఒక మనుష్యుడు ప్రజలకొరకు చనిపోవుట మీకు ఉపయుక్తము" అని ఆయన మహా సభనుద్దేశించి తెలియజెప్పాడు (యోహాను 11:50).

కయప మహా సభతో మాట్లాడుచుండగా, దేవుడు ఒక ప్రాముఖ్యమైన సత్యమును, ఒక దైవీకమైన ప్రవచనమును ప్రకటించుటకు అతని అధికారమును మరియు అతని మాటలను వాడుకొన్నాడు. "తనంతట తానే ఈలాగు చెప్పలేదు గాని ఆ సంవత్సరము ప్రధానయాజకుడై యుండెను గనుక యేసు ఆ జనము కొరకును, ఆ జనము కొరకు మాత్రమే గాక చెదరిపోయిన దేవుని పిల్లలను ఒక్కటిగా సమకూర్చుటకును, చావనైయున్నాడని ప్రవచించెను" అని అపొస్తలుడైన యోహాను చెప్పుచున్నాడు (యోహాను 11:51, 52). దేవుడు గతములో దైవికమైన సత్యమును దేవుని జనములో కంటె బంగారములో ఎక్కువ ఆసక్తి కలిగియుండిన ఒక ప్రవక్త, బిలాము ద్వారా బయలుపరిచాడు (సంఖ్యాకాండము 22–24), మరియు అనేక దేవతలను ఆరాధించిన బబులోను రాజులలో ఒకడు, నెబుకద్నెజరు (దానియేలు 2; 4) ద్వారా బయలుపర్చాడు గనుక క్రీస్తు యొక్క సిలువ మరణమును గూర్చిన ప్రకటన చేయుటకు ఇప్పుడు ఆయన కయపను వాడుకొనుచున్నాడంటే మనము మరీ ఎక్కువ ఆశ్చర్యపడము. కయప "తనంతట తానే ఈలాగు చెప్పలేదు" అని యోహాను బయలుపర్చుచున్నాడు. అనగా అతడు పరిశుద్ధాత్మ ప్రేరేపణతో ఆ విధముగా మాటలాడుచుండెనని అతనికి తెలియదని కయప చేసిన దాని గూర్చిన ఈ దైవిక వ్యాఖ్యానము అర్థమిచ్చుచున్నది. అతడు అవినీతిపరుడును

స్వార్థపరాయణుఁడైనప్పటికిని, కయప ఒకప్పుడు పరిశుద్ధమును దేవుని ఆధీనములో ఉండినదియునైన ఇశ్రాయేలులో ప్రధాన యాజకుడుగా నుండు అధికార ఆసనమును ఆక్రమించలేదు. పాత నిబంధన కాలములో దేవుడు ఊరీము తుమ్మీము కలిగియుండిన ప్రధాన యాజకుని ద్వారా, ప్రజలకు ప్రత్యక్షతల నిచ్చుటకు, ఈ అధికారమును వాడుకొనుచు మాట్లాడాడు. చారిత్రాత్మకమైన ఈ సమయములో, దుర్మార్గుడైన ఈ ప్రధాన యాజకుని ద్వారా దేవుడు విశ్వమంతటి నేలుచున్న సార్వభౌముడు, క్రీస్తు గూర్చి సంభవింపనై యుండిన సంగతుల విషయము ఒక ప్రత్యేక ప్రకటన చేయుటకు ఎన్నుకొన్నాడు.

*మన రక్షకుని మరణ నేపథ్యములో, కయప మరియు యూదుల మహా సభయొక్క స్వార్థపరత్వమును, ఈర్ష్యను, మరియు గర్వమును ఈ ప్రవచనము చిత్రీకరించుచున్నది.* ఈ ప్రధాన యాజకుడు మరియు మహా సభ న్యాయము, అమాయకత్వము, మరియు సత్యము కంటె, వారి పదవులు, వారి సిరిసంపదలు, మరియు యూదులపై వారికి గల అధికారము గూర్చియే ఎక్కువ ఆందోళన చెందుచుండిరి.

కయప ప్రవచనము లాజరు పునరుత్థానమునబట్టి చేయబడినది (యోహాను 11:35–44). యేసే, క్రీస్తు అని ఈ అద్భుతము అనేక మంది యూదులను ఒప్పింపజేసినది. ప్రధాన యాజకుడుగాని యూదుల మహా సభవారుగాని ఈ అద్భుతమును కాదనలేకపోయారు. రుజువు స్పష్టముగా వారి యెదుట ఉండినది; లాజరు మృతులలో నుండి లేపబడ్డాడు. గనుక "మనమాయనను ఈలాగు చూచుచు ఊరకుండినయెడల అందరు ఆయనయందు విశ్వాసముంచెదరు, అప్పుడు రోమీయులు వచ్చి మన స్థలమును మన జనమును ఆక్రమించుకొందురు" అని యేసు శత్రువులు అన్నారు (యోహాను 11:48). వారు "మనము ఈ రుజువును అంగీకరించి ఆయనయందు విశ్వాసముంచుదము" అని అనలేదు. వారు "మనము ఏదో ఒకటి చేయనట్లయితే, ఆయన మనలను సర్వనాశనము చేస్తాడు!" అని అన్నారు. సత్యము కొరకు నిలబడినవారు వాస్తవముగా దానిని కనుగొన్నప్పుడు దానిని అంగీకరించుటకు ఆసక్తి చూపలేదు!

*నీతి బాహ్యమైన నాయకుని పెదవుల ద్వారా ఈ ప్రవచనము పలుకబడినప్పటికిని, యేసు మరణము గూర్చిన క్రొత్త నిబంధనలోని ప్రవచనములలో ఇదొక గొప్ప అర్థసహితమైన ప్రవచనమై యున్నది.* యేసు ఇశ్రాయేలీయుల కొరకు మాత్రమే కాదు గాని, ఇతర దేశముల యందు చెదరియున్న వారి కొరకు కూడా మరణించునని ఈ ప్రవచనము ప్రకటించుచున్నది. "చెదరిపోయిన దేవుని పిల్లలను" (యోహాను 11:52) అను ఈ ఉల్లేఖనము అన్యజనులను సూచించుచున్నది. ఇంకా, ఆయన మరణము దేవుని కుటుంబములోని వారినందరిని ఒక చోట సమకూర్చునని ఈ ప్రవచనము చెప్పుచున్నది. ఒక్క వ్యక్తీకరణ ఘోషణలో, ఆయన ఇతరుల కొరకు మరణించును గనుక, యేసు మరణము యొక్క ప్రత్యామ్నాయ స్వభావము గూర్చి: ఆయన యూదుల కొరకును ఆన్యజనుల కొరకును మరణించును గనుక ఆయన మరణము యొక్క సార్వజనీనత గూర్చి: ఆయన దేవుని పిల్లలందరిని ఏకముగా సమకూర్చును గనుక, ఏకము చేయు ఆయన మరణము యొక్క ప్రభావము గూర్చి ఈ ప్రవచనము ముందుగానే పలికినది. కయప ఈ విషయమును ఎరిగియుండనప్పటికిని, అతని పెదవుల ద్వారా యేసు మరణించుటకు గల హేతువు గూర్చి ఒక లోతైన అవగాహనను లోకమునకు అనుగ్రహించాడు. కేవలము యేసు మరణమునకు అప్పగింపబడవలెనని అతడు మామూలుగా

వాదించుచున్నాడని అవినీతిపరుడైన ప్రధాన యాజకుడు అనుకొన్నాడు, కానీ వాస్తవమునకు అతడు యేసు మరణించుటలో గల ఉద్దేశమును ప్రవచించుచుండెను! దేవుడు అతని ద్వేషపూరిత మాటలను తీసుకొని వాటిని ఒక ప్రేమపూరిత బృందగానముగా మార్చాడు.

*దేవుడు, యేసు యొక్క ఇహలోక జీవితమందంతటియందును, లోకమును సిలువ వైపునకు విడువకుండా ఎట్లు నడిపించుచుండెనో ఈ ప్రవచనము మనకు గుర్తుచేయుచున్నది.* యేసు మరణము ఒక ప్రమాదవశాత్తు సంభవించిన సంఘటన లేక తరువాత తట్టిన ఒక ఆలోచన కాదు. అది నిత్యత్వము మరియు కాలము ఎదురుచూచుచుండిన యేసు జీవితము యొక్క పతాకస్థాయియై యుండెను. దేవుడు లోక రక్షణార్థమైన తన నిత్య సంకల్పమును నెరవేర్చుకొనుచుండెను. దేవుడు ఈ ప్రణాళిక గూర్చి తన ప్రవక్తలు, అపొస్తలులు మరియు ప్రేరేపింపబడిన ఇతరుల ద్వారా – ఇతరులతో రహస్యముగా సమ్మతించుచుండిన ప్రధాన యాజకుని ద్వారా సహితము మనకు తెలియజేశాడు. దేవుడు తన పరిశుద్ధ సేవకుల ద్వారా, లేక అన్ని కాలములందు అత్యధికముగా అపఖ్యాతిపాలైన ప్రధాన యాజకుని ద్వారా, యేసు మరణము గూర్చి తెలియజెప్పిన దేనినైనను మన మనఃపూర్వక ధ్యానములలో నుండి తొలగిపోనీయకూడదు.

❖◆❖◆❖

*ఆయన దైవికమైన జ్ఞానము చొప్పున, వారు దేవుని చిత్తమును నెరవేర్చుచున్నారని వారు బొత్తిగా ఎరుగకుండినప్పటికిని తన సంకల్పములను నెరవేర్చుకొనుటకు దేవుడు అప్పుడప్పుడు ప్రజలను వాడుకొన్నాడు. ఆయన బిలాము పయనించుచుండిన గార్దభము ద్వారా, కోరెషు, నెబుకద్నెజరు, మరియు కయప వంటి ప్రభావశాలుల ద్వారా, తన కార్యములను నెరవేర్చుకొన్నాడు. ఆయన చిత్తమునకు విధేయులు గాని వారిని దేవుడు వాడుకొనగలిగినట్లయితే, ఆయనకు విధేయతతో లోబడువారిని శక్తివంతముగా వాడుకొనునని మనము దృఢనిశ్చయముగలవారమై యుండవచ్చును.*